# ఉగాదికి పచ్చడి పచ్చడి!

"ఒకసారి నిద్రపోతే మరో లోకానికి వెళ్ళిపోతారు. అప్పుడే తెల్లారకట్ల నాలుగు అయిపోయింది. ఈరోజే ఉగాది పండగ! మీకు జ్ఞాపకం ఉందా! ప్రతీ సంవత్సరం పండగకి ఒకరోజు ముందే, కావలసిన మామిడాకులు, కాయలు వగైరా అన్నీ తెచ్చి యింట్లో పెట్టేవారు. తొందరగా లేచి కాఫీ తాగి బయల్దేరండి. కాస్సేపట్లో "తెలుగు వెలుగు" కూడా వచ్చేస్తుంది". అంది పరిమళ, తన భర్తతో.

"చాలా బాగుంది నీ వరస! తెలుగు సంవత్సరాది నాడు వచ్చేది "తెలుగు వెలుగు" అని, జనవరి ఒకటవ తారీఖున వచ్చేది "ఇంగ్లీషు వెలుగు" అని మొదలెట్టకు! సమస్త ప్రపంచానికి వచ్చేది ఒకే వెలుగు, అదే "సూర్యుని వెలుగు" అన్నాడు పరిమళ భర్త.

"మన పెళ్ళయి పది సంవత్సరాలైంది. నేనేం చెప్పిన వెంటనే మీకు అర్థం కాదు! ఈరోజు "తెలుగు సంవత్సరాది', అందుకని తెలుగు వెలుగు వస్తుందని చెప్పాను నేను."

"సంతోషకరమైన పండగ వాతావరణం యింట్లో ప్రవేశ పెడదామని , "అయితే మీరు సెలవిచ్చిందేమిటో చెప్పండి, సువాసనల పరిమళగారూ!" అన్నాడు, పరిమళ భర్త.

"తెలుగు వెలుగు" వస్తుందంటే, "తెలుగు వెలుగు" అనే మాసపత్రిక" ప్రభూ!"

"మరి స్పష్టంగా సెలవివ్వచ్చుకదా!"

"ప్రతీ ఏడాది ఈ మామిడి ఆకులూ వగైరా కొనుక్కుంటే సరిపోతుంది కదా! ఇప్పుడు ఎవరింటికి వెళ్ళి మామిడి ఆకులు కోసుకురాను! అప్పుడే నాలుగైపోతుంది అన్నావ్! కాసేపట్లో వెలుగు వచ్చేస్తోంది. పండగనికదా అని చెప్పి, వాళ్ళు పెందరాళే నిద్రలేస్తే నన్ను పట్టుకు ఉతుకుతారు!

'ఉతుకుతే మంచిదేకదా! కొంతలో కొంత మీ వంటి నున్న మురికిపోయి, తెల్లపడితే, నేను తలంటు పోసేటప్పుడు నాకు శ్రమ 'తగ్గుతుంది. ఈ పరాచికాలు తదుపరి కార్యక్రమంలో చూద్దాం! మన అవధానిగారి యింటికి వెళ్ళండి! ఈ మధ్య ఆయనికి ఆరోగ్యం బాగా లేదని విన్నాను. ఆయన లేచేసరికి ఎలాగూ ఆలస్యమవుతుంది".

కాఫీ సేవించి తన తోడల్లుడ్ని తోడు తీసుకుని అవధాని గారింటికి వెళ్ళాడు పరిమళ భర్త.

"మీరేం కంగారు పడకండి అన్నయ్యా! ఈ గోడ దగ్గరే నిలబడండి!" అంటూ

ప్రహారీ గోడ ఎక్కి, గోడ దగ్గరగా ఉన్న మామిడి కొమ్మ మీద కాలేసి చెట్టెక్కేశాడు, పరిమళ భర్త.

కొన్ని మామిడి ఆకులూ, పిందెలూ బుజానికి తగిలించుకున్న తన సంచీలో వేసుకుంటూన్న సమయంలో, ఓ చిన్న మామిడి కొమ్మ విరిగి కిందపడి, కొంచెం చప్పుడు వచ్చింది!"

"ఎవర్రా" అంటూ అవధానిగారు అరుస్తూ, బయటికి వచ్చారు.

పరిమళ భర్త గుండె గుభేల్ మంది! "అనారోగ్యంగా ఉంటేనే యింత గట్టిగా అరిచాడు, ఆరోగ్యం బాగుంటే, అమ్మో యిక చెప్పక్కర్లేదు! అనుకున్నాడు పరిమళ భర్త.

మళ్ళీ అలికిడి లేక పోయేసరికి, "ఎవరూ లేరు" అని లోపలికి వెళ్ళిపోయారు అవధాని గారు.

"హమ్మయ్య! ఓచెట్టు పని అయిపోయింది! ఇక వేప చెట్టు పని పడతా! అనుకుంటూ, పక్కనే ఉన్న వేపచెట్టు సమీపించాడు.

"చెట్టులెక్కగలవా, ఓ నరహరి పుట్టలెక్కగలవా, చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మల చిగురుకోయగలవా!" అనే పాట మననం చేసుకుంటూ చెట్టెక్కేశాడు.

ఇంతలో, ఆ కాలనీ వాసులకి పితికిన పాలు పితికినట్లు పొయ్యాని పోలయ్య, పరిమళ భర్తని ఆ చెట్టుమీద చూసి ఆనవాలు పట్టాడు. అప్పుడప్పుడే కొంచెం వెలుగు వస్తోంది. ఏ మాత్రం కొంచెం వెలుగున్నా, పోలయ్య పరిమళ భర్తని పోల్చుకోగలడు! పరిమళ భర్త రూపురేఖా విలాసాలు పోలయ్య హృదయంలో చెరగని ముద్ర వేశాయ్! కారణం! "పోలయ్యా! రోజూ నీళ్ళపాలు పోస్తున్నావ్! డబ్బులు తీసుకుని యిలా అన్యాయం చేసే వాళ్లని దేవుడు ఎన్నటికీ క్షమించడు" అని నిత్యం సతాయించే పరిమళ భర్తని ఎక్కడ చూసినా గుర్తు పట్టడంలో ఆశ్చర్యమేముంది!

"ఎప్పటికైనా ఈయన దొరకక పోతాడే, దొరికినప్పుడు ఓ చూపు చూద్దాం!" అనుకున్న పోలయ్య కోరిక తీరింది! అతన్ని వేపచెట్టుమీద చూడనే చూశాడు.

పాలు పోయించుకోవడానికి బయటికి వచ్చిన అవధాని గారితో, "మీరే మనుకోకండి కొంచెం వేపపువ్వు కోసుకుంటాను" అన్నాడు.

"అదేమిటోయ్! అంత మొహమాట పడిపోతావ్ బోల్డుమంది దొంగ వెధవలు, అదికూడా చదువుకున్నవాళ్ళు, మమ్మల్ని అడగకుండానే కోసుకుపోతున్నారు! నిరభ్యంతరంగా తీసుకెళ్ళు!"

"దొంగ వెధవలు కోసుకు పోతున్నారు' అన్న మాటలు పరిమళ భర్తకి వినిపించాయి. కాని దొంగకి తేలుకుట్టినట్లు ఊరుకున్నాడు!

ఈ పోలయ్య చెట్టు సమీపించే లోపున చెట్టు దిగిపోవాలను కున్నాడు పరిమళ భర్త! కానీ, చెట్టు దిగేలోపున చెట్టు దగ్గరకెళ్ళాలన్న" పోలయ్య కోరికే తీరింది!

చెట్టు దగ్గరికి వస్తూనే, "దొంగ! దొంగ!" అని అరిచాడు పోలయ్య!

మిలిటరీ ఆఫీసర్‌గా పని చేస్తూన్న అవధానిగారి అబ్బాయి "ఎక్కడ! ఎక్కడ!" అంటూ యింట్లోంచి బయటికి వచ్చాడు.

అతన్ని చూసి, "అబ్బాయిగారూ! మీరెప్పుడూ వచ్చారు!" అన్నాడు పోలయ్య.

"అది తర్వాత చెపుతాను! ముందు దొంగ వెధవ ఎక్కడున్నాడో చెప్పు!"

"కొంప మునిగి పోయింది! అప్పటికే కొంత వేప పువ్వు కోసుకున్న పరిమళ భర్త "కోసుకున్నవారికి కోసుకున్నంత" అనుకుంటూ, భూమ్మీదకి ఒక్క దూకు దూకాడు.

"ఎవడ్రా నువ్ "దొంగసన్నాసి!" "ఓ మిలిటరీ ఆఫీసర్; యింట్లో ఉండగానే, ఇక్కడ దొంగతనం చెయ్యడానికి నీ కెంత ధైర్యంరా!" అని చొక్కాపట్టుకుని ఓ నాలుగు పీకాడు. ఇంతలో అవధానిగారు కూడా వచ్చారు.

"నేను పరిమళ భర్తనండి"

"నీకొక ఊరుపేరూలేదా! పెళ్ళాం పేరు చెప్పుకుని బ్రతికే నువ్ కూడా ఓ మగాడివేనా! ఆడదాని పేరు చెప్పుకుని బ్రతికేవాడివి, ఓ పెద్ద మగాడిలాగా చెట్టెందుకు ఎక్కావ్! 'పరిమళ భర్తట! పరిమళ భర్త! అగస్త్య భ్రాతాలా!" అని ఈసడింపుగా చూశాడతని కేసి మిలిటరీ ఆఫీసర్.

ఇంతలో అవధానిగారు, యిందాకా నేను బయటకి వచ్చి 'ఎవరు' అని అడిగినప్పుడు, "పరిమళ భర్తని" అని ఎందుకు ఏడవలేదు!" అన్నారు.

పెళ్ళయినప్పట్నుంచీ, "పరిమళ భర్తని" అని ఏడుస్తూనే ఉన్నానండి! ఇందాకా ఒక్కసారి మాత్రం ఏడవనందుకు, యిప్పుడు ఏడవవలసి వచ్చింది, నాకర్మసార్!' అని ఏడుపు మొదలెట్టాడు.

"పండగపూటా మాయింట్లో ఏడవకు! మీ యింటికెళ్ళి ఏడు! రాత్రింబవళ్ళు, దేశసరిహద్దుల్లో, ప్రాణాలు లెక్కచెయ్యకుండా మేం కాపాలా కాస్తూంటే, మీరు యిక్కడ మాయిళ్ళల్లో దొంగతనాలు!"

"క్షమించండి సార్ మామిడి ఆకులు కావాలని వచ్చాను"

"వీడు పెద్ద దొంగసన్యాసి నాన్నగారూ! ఈ సంచిలో మామిడి పిందెలూ వేప

పువ్వుకూడా ఉన్నాయ్!"

"ఈయన మనిషి మంచివాడే సార్! బయట ప్రహరీ గోడ దగ్గర ఇంకొకడు ఉన్నాడు, ఇవ్వన్నీ అతను చేయించి ఉంటాడు" అని వెళ్ళిపోయాడు పోలయ్య.

"అంటే బయట యింకొక దొంగసన్నాసి గాడున్నాడన్న మాట!" అంటూ బయటికి వచ్చిన మిలిటరీ ఆఫీసర్ని చూసి, కింద పడిపోయాడు పరిమళ బావగారు.

"లే! లే! పైకి లే! నువ్వేమవుతావ్ ఈ పరిమళ భర్తకి"

"తోడల్లుడ్ని" సార్!

అంటే మీరు తోడల్లుళ్ళు, తోడు దొంగలూ కూడా నన్నమాట! నువ్ వయస్సులో పెద్దవాడిలా ఉన్నావ్! దగ్గరుండి ఈ దొంగతనాలెందుకు చేయిస్తున్నావ్!"

"లేదు సార్! ఉగాది పండగకి రమ్మంటే వచ్చాను!"

"అంటే, అప్పనంగా ఈ ఉగాది దొంగపచ్చడి తినడానికి వచ్చావన్నమాట! ఈసారెప్పుడైనా ఏ ఉగాదికైనా ఈ ఊళ్లోకనిపించావో, నిన్ను కూడా పచ్చడి పచ్చడి చేస్తాను ఈసారికి ఆ సంచీ తీసుకుని యింటికెళ్ళి తలంటు పోసుకోండి! మీకివే నా ఉగాది శుభాకాంక్షలు" అనగానే, తొందర తొందరగా వెర్రి మొహాలు వేసుకుని ఇద్దరు తోడల్లుళ్ళు యింటికి వచ్చేశారు.

తన భర్త మొహం చూడగానే, "ఏమిటండీ! మీ మొహం అలా పచ్చడిపచ్చడి అయిపోయింది" అంది పరిమళ.

"అవధానిగారి పెద్దబ్బాయి మిలిటరీ ఆఫీసర్‌ట. ఈపండగకి సెలవు పెట్టివచ్చినట్టున్నాడు, అంతా నా కర్మ నేను వేపచెట్టుపైనున్న సమయానికి మన పాల పోలయ్య, వేపపువ్వు కోసుకోవడానికి చెట్టు దగ్గరకొచ్చి, "దొంగ దొంగ" అని అరిచాడు.

ఆ మిలిటరీ ఆఫీసర్ నానామాటలూ అని నాలుగు పీకాడు".

ఈ మాటలు వింటూన్న పరిమళ అక్కయ్య బయటికి వచ్చి, "మీ మొహం చూపించండి, మిమ్మల్ని కూడా కొట్టాడా! మీ మొహం కూడా పచ్చడి పచ్చడి అయిందా! అంటూ తన భర్త మొహం చూసి, "చాలా అదృష్టవంతులం" అంది.

"బావ ఎప్పుడూ అన్నిచోట్లా తప్పించుకుపోతాడు! నీకు, మీ ఆయన మొహం బాగుంటే చాలు! మా ఆయన ఏమైపోయినా ఫర్వాలేదు" అంది, పరిమళ.

"ఈసారి ఏ ఉగాదికైనా ఈ ఊళ్ళో కనిపిస్తే, నా తొక్క తీస్తానన్నాడు ఆ మిలిటరీ ఆఫీసర్!" అన్నాడు, పరిమళ బావగారు.

"ఏం కాదు బావా! ధైర్యంగా వుండు! వచ్చే ఉగాదికి కూడా రండి, అసలు ఏం

జరుగుతుందో చూద్దాం!"

"అయినా ఆ ఆకులూ అవీ కలిసి ఓ పాతిక రూపాయలు కూడా ఉండవ్, ఈ కాస్తదానికీ యిన్ని దెబ్బలా!" అంది పరిమళ అక్కయ్య.

"నా గ్రహస్థితి బాగాలేదు! నేనసలు ఈ ఉగాది పచ్చిడి తినను" అన్నాడు, పరిమళభర్త.

"కొంచెం పచ్చడైనా తినాలి, అది శాస్త్రం! మన గ్రహస్థితి ఆనక పంచాంగ శ్రవణంలో తెలుస్తుంది" అంది పరిమళ.

"ఈరోజు సాయంకాలమే మా ప్రయాణం" అన్నాడు పరిమళ బావగారు.

"అవధానిగారి అబ్బాయి ఎప్పుడు వెళతాడో తెలుసుకుంటాను! ఓ నాలుగు రోజులుండి, మా ఆయన దెబ్బలు తగ్గిన తర్వాత వెళుదురుగాని" అంది పరిమళ.

"మేం బయల్దేరిన వేళా విశేషం మంచిది కానట్లుంది. మా ఊరు వెళ్ళి మంచి ముహూర్తం చూసుకుని మళ్ళీ వస్తాం" అన్నాడు పరిమళ బావగారు.

"సరే అయితే మీ యిష్టం" అంది పరిమళ.